
సాక్షి
అనంతపురం
శనివారం । 12 । జూలై । 2025



కదం తొక్కిన విద్యార్థులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసి.. చదువులు సాఫీగా కొనసాగేలా చూడాలని విద్యార్థులు కదం తొక్కారు. 8లో



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు, కనిష్టం రూ.3 వేలు, సరాసరి రూ.12,500 చొప్పున పలికాయి.

గరిష్టం/కనిష్టం
37.4°/22.1°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

ప్రజల పక్షాన పోరాటం





సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు అనంత, చిత్రంలో పార్లమెంట్ పరిశీలకుడు నరేష్‌కుమార్‌రెడ్డి తదితరులు

- ఈ నెల 20 నుంచి రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో
- హామీల అమలులో వంచనపై ప్రజల్లో చైతన్యం తెద్దాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత

అనంతపురం కార్పొరేషన్: 'కూటమి ఏడాది పాలనలో సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు ఇవ్వాల్సిన రూ.81 వేల కోట్లు ఎగనామం పెట్టారు. కొత్తగా అభివృద్ధి ఎక్కడా కన్పించలేదు. ఇటువంటి తరుణంలో ప్రజల పక్షాన పోరాటం చేద్దాం. వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపునిచ్చిన 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' కార్యక్రమాన్ని చేపట్టి ప్రజలను చైతన్యవంతులను చేద్దాం' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని యాపిల్ ఫంక్షన్ హాలులో అనంత అధ్యక్షతన అనంతపురం అర్బన్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. తొలుత దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి ప్రతి డివిజన్‌లోనూ 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు ప్రజలకు చేసిన మోసాలను వివరించాలన్నారు. తాము అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల కోసం పని చేస్తామన్నారు.

హామీల అమలుపై నిలదీద్దాం

అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఏడాదికి రూ.20వేలు, నిరుద్యోగులకు రూ.3వేలు, 18 ఏళ్లు నిండిన మహిళలకు ప్రతి నెలా రూ.1500, అలాగే 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పింఛన్, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామన్న హామీల అమలు కోసం ప్రభుత్వాన్ని నిలదీద్దామని పార్టీ శ్రేణులకు అనంత పిలుపునిచ్చారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.వెయ్యి కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టామని, కేంద్ర సహకారం, అప్పటి సీఎం జగన్ చొరవతో అనంతపురంలో రోడ్ల విస్తరణతో పాటు గుత్తి రోడ్డు, పంగల్ రోడ్డు నుంచి బళ్లారి బైపాస్ వరకు నాలుగులేన్ల రోడ్డు నిర్మించామని, 18 నెలల్లో టవర్‌క్లాక్ బ్రిడ్జి పూర్తి చేశామన్నారు.

బాబు మోసాలను ఎండగడదాం

'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' కార్యక్రమం ద్వారా చంద్రబాబు మోసాలను ఎండగడదామని వైఎస్సార్‌సీపీ అనంతపురం పార్లమెంట్ పరిశీలకుడు నరేష్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వంలో అక్రమ కేసులు, బెదిరింపులకు భయపడకుండా వైఎస్సార్‌సీపీ శ్రేణులు గట్టిగా నిలబడ్డారని, ఇదే స్ఫూర్తితో ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాల గురించి వివరిద్దామన్నారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయభాస్కర్‌రెడ్డి, పార్టీ పీఏసీ సభ్యుడు మహాలక్ష్మి శ్రీనివాస్, జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్‌గౌడ్, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు శ్రీదేవి, సైఫుల్లా బేగ్, రాష్ట్ర నాయకులు మీసాల రంగన్న, సాకే చంద్రలేఖ మాట్లాడారు. అనంతరం 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' పోస్టర్ ఆవిష్కరించారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు వెన్నం శివరామిరెడ్డి, చింతకుంట శ్రీనివాసులు, టీటీడీ మాజీ బోర్డు సభ్యుడు అశ్వత్థనాయక్, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఓబిరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, నాయకులు హుస్సేన్‌పీరా, మారుతీనాయుడు, ఎగ్గుల శ్రీనివాసులు, పెన్నోబులేసు, శేఖర్ బాబు, హబీబుల్లా, అమర్‌నాథ్‌రెడ్డి, కేశవరెడ్డి, రామయ్య, కృష్ణవేణి, దేవి, ప్రియాంక, ఉష తదితరులు పాల్గొన్నారు.

రూ.100 కోట్లు ఎక్కడ ఖర్చు చేశారు?



కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలో అనంతపురం అర్బన్‌లో రూ.100 కోట్లు ఖర్చు చేశారని ప్రచారం చేస్తున్నారని, ఇంతకూ ఏ పనులకు అనుమతులు తీసుకొచ్చారో చెప్పాలని అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. రుద్రంపేట రోడ్డు మంజూరు చేయించి, బ్రిడ్జిపూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని గుర్తు చేశారు. కూటమి వచ్చాక 20 శాతం పనులు చేసి.. క్రెడిట్‌ను వారి ఖాతాలోకి వేసుకుంటున్నారన్నారు. ఎ.నారాయణపురంలో బ్రిడ్జి మంజూరు చేసి పనులు ప్రారంభిస్తే.. దాన్ని కూడా వారే చేసినట్లు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రాంనగర్‌లో రూ.2.50 కోట్ల రోడ్ల పనులకు ఈఎన్‌సీ అనుమతులను తామే తీసుకువచ్చామన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అనంతపురానికి రూ.25 కోట్లు ప్రత్యేక నిధులు తీసుకువచ్చానని, అందులో రూ.7 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. ఈ ప్రభుత్వం వచ్చాక పనులన్నీ రద్దు చేసి, నగరాభివృద్ధికి అడ్డంకిగా నిలిచారని మండిపడ్డారు. నియోజకవర్గంలో ఉపాధి హామీ కింద రూ.6 కోట్లతో పనులు చేశారు తప్పితే అదనంగా ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు.

ఆక్రమణలో 2,903 ఎకరాల ఆలయ భూములు

- భూముల పరిరక్షణకు చర్యలు: కలెక్టర్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్, చిత్రంలో జేసీ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: జిల్లా వ్యాప్తంగా 2,903 ఎకరాల దేవాలయ భూములు ఆక్రమణలకు గురయ్యాయని కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఆలయ భూముల పరిరక్షణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి కలెక్టర్ జిల్లాస్థాయి ల్యాండ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేవాలయ భూములు కౌలుకు ఇవ్వడం ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆలయ ధూప, దీప, నైవేద్యాలకు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. అలాంటి భూములు ఆక్రమణకు గురికావడాన్ని తీవ్రంగా పరిగణిస్తామన్నారు. జిల్లాలో దేవదాయ శాఖ పరిధిలోని ఆలయ భూములు ఎన్ని ఉన్నాయి.. అందులో ఎన్ని సాగులో ఉన్నాయి అనేది నిర్ధారించుకోవాలన్నారు. ఆక్రమణ గురైన వాటిని స్వాధీనం చేసుకోవడంతో పాటు భూములన్నీ మండల ఇన్‌చార్జి ద్వారా కౌలుకు ఇచ్చి సాగులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దేవాలయ భూములను సాగు చేసే కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు ఇవ్వాలని చెప్పారు. జాతీయ రహదారులకు సంబంధించి దేవాలయ భూములను సేకరిస్తూ అందుకు పరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ మలోల, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరెడ్డి, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్, భూ విభాగం సూపరింటెండెంట్ రియాజుద్దీన్, ఆలయాల ఈఓలు, ఏఈఓలు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

డెంగీతో బాలింత మృతి



షేక్ చాందిని (ఫైల్)

గార్లదిన్నె: డెంగీ జ్వరంతో ఓ బాలింత మృత్యువాతపడింది. ఈ ఘటనతో కల్లూరులో విషాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బుక్కరాయసముద్రం మండలం పి.కొత్తపల్లికి చెందిన షేక్ చాందిని (22)కి ఏడాదిన్నర క్రితం గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన షేక్ సాదిక్ అనే కూలీతో వివాహమైంది. రెండు నెలల క్రితం చాందిని పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ క్రమంలో ఈ నెల ఆరో తేదీన చాందినికి జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు పామిడి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి డెంగీ జ్వరం అని తేల్చారు. దీంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సవీర ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స చేయించినా జ్వరం తగ్గకపోవడంతో చాందిని శుక్రవారం మృతి చెందింది. భార్య మరణాన్ని భర్త జీర్ణించుకోలేకపోయాడు. పసికందును ఎత్తుకుని.. తల్లిలేని లోటు ఎవరు తీరుస్తారంటూ కన్నీరుమున్నీరయ్యాడు.

జిల్లాకు వర్ష సూచన

బుక్కరాయసముద్రం: జిల్లాలో రాగల ఐదు రోజులు అధిక గాలులతో కూడిన చిరు జల్లులు కురిసే అవకాశం ఉన్నట్లు రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

రోడ్డు ప్రమాద కారకుడికి జైలు

పెనుకొండ: వాహనాన్ని అజాగ్రత్తగా నడిపి తనతో పాటు మరో ముగ్గురిని క్షతగాత్రులను చేసిన ఓ వ్యక్తికి పెనుకొండ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బొజ్జప్ప 3 నెలల జైలు శిక్ష విధించారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు... అనంతపురం జిల్లా కూడేరు మండలం కమ్మూరు గ్రామానికి చెందిన అమర్నాథరెడ్డి, రఘునాయక్, సుధాకర్, కుళ్లాయప్ప తదితరులు ఓ పని నిమిత్తం 2018 జూన్ 18న క్రూజర్ వాహనంలో పెనుకొండకు బయలుదేరారు. వాహనం అమర్నాథరెడ్డి నడుపుతున్నాడు. వీరి వాహనం ఆర్టీఓ చెక్‌పోస్ట్, రబ్బర్ ఫ్యాక్టరీ మధ్యకు రాగానే టైరు పేలి బోల్తా పడింది. ఈ ఘటనలో వాహనంలోని వ్యక్తులందరూ గాయపడ్డారు. ఈ మేరకు అప్పట్లో కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తులో ప్రమాదానికి అమర్‌నాథ్‌రెడ్డి కారకుడిగా నిర్ధారించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసును విచారించిన పెనుకొండ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ బొజ్జప్ప నేరం రుజువు కావడంతో ముద్దాయి అమర్‌నాథ్‌రెడ్డికి 3 నెలల జైలు, రూ.1,500 జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు వెల్లడించారు.

బదిలీ ఉత్తర్వులు ఇవ్వండి



ధర్నా చేస్తున్న ఏఎన్‌ఎంలు, నాయకులు

అనంతపురం అర్బన్: బదిలీల ప్రక్రియ ముగిసి పన్నెండు రోజులవుతున్నా.. ఇప్పటి వరకూ తమకు స్థానాలు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో సచివాలయ ఏఎన్‌ఎంలు ఆందోళనకు దిగారు. ఏపీ గ్రామ/వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీలు, ఏఎన్‌ఎంల సంఘం ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ చేరుకుని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షురాలు రజని, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి మాట్లాడారు. గ్రేడ్-3 నుంచి గ్రేడ్-2 పదోన్నతి పొందిన ఏఎన్‌ఎంలకు కేటాయించిన సబ్‌సెంటర్లకు పంపక పోగా ఆయా స్థానాలు ఖాళీ కావని ప్రకటించడం అన్యాయమన్నారు. పదోన్నతి పొందిన ఏఎన్‌ఎంల స్థానాలను ఖాళీలుగా చూపాలన్నారు. రీ-కౌన్సిలింగ్ నిర్ణయం ఉపసంహరించాలన్నారు. ఏఎన్‌ఎంల బదిలీల ఖాళీ స్థానాలను పదోన్నతి పొందిన ఏఎన్‌ఎంలకు కేటాయిస్తే... వారిని కూడా వైద్య శాఖలో విలీనం చేయాలన్నారు. బదిలీలకు సంబంధించి ఉత్తర్వులను తక్షణం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, ఏఎన్‌ఎంలు వసుంధర, రేఖ, అఖిల, సావిత్రి, పద్మావతి, జయలక్ష్మి, సుశీల, త్రివేణి పాల్గొన్నారు.

జీఎస్టీ వసూళ్లలో అబ్రకదబ్ర

- ఎవరు కడుతున్నారో.. ఎవరు ఎగ్గొడుతున్నారో?
- ప్రధాన మార్కెట్లన్నింటిలోనూ జీరో బిజినెస్సే
- అధికారులే వ్యాపారులతో కుమ్మక్కవుతున్న పరిస్థితి
- అన్ని జిల్లాల్లో జీఎస్టీ 50 శాతం తగ్గినట్టు లెక్కలు
- కానీ ఉమ్మడి అనంతపురం జిల్లాలో భారీగా వసూళ్లట
- బిజినెస్‌లన్నీ కుదేలైన పరిస్థితుల్లో ఎలా పెరిగిందో మరి..!



ఉమ్మడి అనంతపురం జిల్లాలో జీఎస్టీ వసూళ్ల గణాంకాలు

సంవత్సరం	జీఎస్టీ వసూళ్లు
2023-24	రూ.227.41 కోట్లు
2024-25	రూ.381 18 కోట్లు

ప్రొఫెషనల్ ట్యాక్స్ వసూళ్ల వివరాలు

2023-24	రూ.12.60 కోట్లు
2024-25	రూ.15.25 కోట్లు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అధికారులు తల్చుకుంటే ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్టు చేయడం పెద్ద కష్టమేమీ కాదని అర్థమైపోయింది. రాష్ట్రవ్యాప్తంగా 2024–25 సంవత్సరానికి జీఎస్టీ వసూళ్లు భారీగా తగ్గినట్టు గణాంకాలు చెబుతున్నాయి. కానీ అనంతపురం జిల్లాలో మాత్రం జీఎస్టీ వసూళ్లు ఎక్కువ చేశామని లెక్కలు చెప్పడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. రియల్ ఎస్టేట్ రంగం బాగా పుంజుకున్న సమయంలోనే జీఎస్టీ వసూళ్లు అంతంత మాత్రంగా ఉంది. మరి 2024–25 సంవత్సరంలో మైనస్ గ్రోత్ రేటు ఉన్న సమయంలో జీఎస్టీ వసూళ్లు 68 శాతం ఎలా పెరిగాయన్నది అంతుచిక్కని పరిస్థితి. అధికారులు అబ్రకదబ్ర చేశారేమో అన్న చర్చ జరుగుతోంది.

ఆడిటర్లకూ అంతుచిక్కని వైనం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో చిరువ్యాపారాలు మొదలుకొని స్టీలు, సిమెంటు, బట్టలు ఇలా ప్రతి వ్యాపారమూ పూర్తిగా నష్టాల్లో ఉంది. వ్యాపారాలు లేక పలువురు షాపులు ఖాళీ చేస్తున్నారు. కూటమి సర్కారు వచ్చాక ఏ ఒక్క బిజినెస్ కూడా లేదని వ్యాపారులు వాపోతున్నారు. పైగా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ బావుంటేనే ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఆదాయం వస్తుంది. 2024–25లో 60 శాతం కూడా లక్ష్యాన్ని చేరలేదు. ప్రభుత్వానికి పన్నుల రూపంలో వచ్చే అన్ని వ్యాపారాలూ చతికిలపడిన పరిస్థితుల్లో జీఎస్టీ వసూళ్లు ఎలా పెరిగాయో పెద్ద పెద్ద ఆడిటర్లకే అంతుచిక్కడం లేదు.

అంతా జీరో బిజినెస్సే

ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా అనంతపురం అర్బన్, హిందూపురం, కదిరి, తాడిపత్రి వంటివి ప్రధాన వ్యాపార కూడళ్లు. ముఖ్యంగా అనంతపురం నగరంలోని కమలానగర్‌లో మొత్తం జీరో బిజినెస్సే. ఒక్క రూపాయి కూడా జీఎస్టీ వచ్చే పరిస్థితి లేదు. స్వయానా జీఎస్టీ అధికారులే వ్యాపారులతో కుమ్మక్కై, ఎలా పన్ను చెల్లించకూడదో సూచనలిచ్చి, ప్రభుత్వానికి రావాల్సిన సొమ్ము సొంతంగా వసూళ్లు చేసుకుంటున్న పరిస్థితి ఉంది. స్టీలు సామాన్ల నుంచి ప్లాస్టిక్ సామాన్ల వరకు ఏ వస్తువు తీసుకున్నా జీఎస్టీ బిల్లు ఉండదు. మొబైల్ షాపుల బిజినెస్ కూడా జీరో వ్యాపారామే. ఎందుకిలా జరుగుతోందని జీఎస్టీ అధికారులను అడిగితే.. 'మాకు తనిఖీలు చేసే అధికారం లేదు, ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారులు రైడింగ్‌కు ఆదేశిస్తారు' అని చెబుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో జీఎస్టీ వసూళ్లు దారుణంగా పడిపోయినా అధికారులు అద్భుతంగా చేసినట్లు చెప్పడంతో వివిధ విభాగాల అధికారులు ఆశ్చర్యపోతున్నారు.

మార్గదర్శకులను గుర్తించాలి



కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: పేదరిక నిర్మూలన కోసం పీ4 కార్యక్రమం కింద మార్గదర్శకులను గుర్తించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శుక్రవారం క్యాంపు కార్యాలయం నుంచి జీరో పావర్టీ పీ4 కార్యక్రమంపై అన్ని శాఖల జిల్లా, డివిజన్, నియోజకవర్గ, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీ4 కార్యక్రమం కింద జిల్లాలో 68,316 బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. వారి భవితకు భరోసా కల్పించేందుకు దాతలను (మార్గదర్శకులు) గుర్తించాలని చెప్పారు. ఇప్పటి వరకు 20 మంది మార్గదర్శకులు లాగిన్ అయి రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. వారు 813 మందిని దత్తత తీసుకున్నారన్నారు. మార్గదర్శకుల గుర్తింపునకు అన్ని శాఖల అధికారులు తమ పరిధిలోని పరిశ్రమల యాజమానులు, పాఠశాలలో చదివి ఉన్నతస్థాయిలో ఉన్నవారిని, ఎన్ఆర్ఐ, ఎన్ఆర్‌ఈలు, బడా వ్యాపారులు, తదితర సంస్థలు, సంఘాలతో ఈ నెల 15లోగా సమావేశం నిర్వహించాలన్నారు.

అధికారులు దత్తత తీసుకోవాలి

జిల్లా అధికారులందరూ ఒక్కొక్క కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమం కింద లక్ష్యాని ఆగస్టు 15 నాటికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 17 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు గ్రామ, వార్డు సభలు నిర్వహించాలన్నారు. ఎంపిక చేసిన బంగారు కుటుంబాల వద్దకు వెళ్లి వారికి ఏ రకమైన సహాయం కావాలనే వివరాలపై ఈ నెల 21 నుంచి ఆగస్టు 6 వరకు సర్వే నిర్వహించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో సీపీఓ అశోక్‌కుమార్, డీఐసీ జెడ్ఎం శ్రీనివాస్‌యాదవ్, డీఈఓ ప్రసాద్‌బాబు, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, డీపీఓ నాగరాజునాయుడు, డీఎంహెచ్‌ఓ దేవి, డీటీసీ వీర్రాజు, ఆర్డీఓలు, తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

ప్రాణాలు బలిగొన్న చేపల వేట సరదా



మృతులు జబీవుల్లా, మన్సూర్‌బాషా

గుమ్మఘట్ట: చేపల వేట సరదా ఇద్దరి ప్రాణాలు బలిగొంది. స్థానికులు తెలిపిన మేరకు.. రాయదుర్గం పట్టణానికి చెందిన మన్సూర్ బాషా (34), కర్ణాటకలోని రాంపుర గ్రామానికి చెందిన జబీవుల్లా (28) ఇద్దరూ మంచి స్నేహితులు. మన్సూర్‌బాషాకు భార్య టబూ, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. టైలరింగ్‌తో కుటుంబాన్ని పోషించుకునేవాడు. అలాగే జబీవుల్లాకు భార్య గుల్జార్‌భాను, ఇద్దరు కుమారులు ఉన్నారు. డ్రైవింగ్ పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. చేపల వేట అంటే ఎంతో ఆసక్తి ఉన్న ఇద్దరూ గురువారం గాలాలు తీసుకుని ద్విచక్ర వాహనంపై బీటీ ప్రాజెక్ట్‌కు చేరుకున్నారు. గాలం వేసే సమయంలో మన్సూర్‌బాషా నీటిలో పడిపోవడంతో కాపాడేందుకు తనకు ఈత రాకపోయినా జబీవుల్లా దిగాడు. లోతు ఎక్కువగా ఉండడంతో ఇద్దరూ నీట మునిగి పోయారు. శుక్రవారం ఉదయం నీటిలో మృతదేహాలు తేలియాడుతుండడం గమనించిన స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను వెలికి తీయించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పీహెచ్‌సీలో తనిఖీలు

వజ్రకరూరు: స్థానిక పీహెచ్‌సీని జాతీయ ఆరోగ్యమిషన్ కార్యక్రమ అధికారి శ్రీనివాసరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులు, వార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి తేజశ్వి, సిబ్బంది పాల్గొన్నారు.

మిస్సింగ్... మిస్టరీ!

- జిల్లాలో పెరుగుతున్న మహిళల అదృశ్యం కేసులు
- ప్రేమ, వివాహేతర సంబంధాలు, కుటుంబ కలహాలే కారణం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల యువతులు, వివాహిత మహిళల అదృశ్యం పోలీసులను కలవర పెడుతోంది. ఒకరి తర్వాత ఒకరు చొప్పున వరుసగా కనిపించకుండా పోతున్నారు. అదృశ్యమైన వారిని పట్టుకోవడం పోలీసులకు సైతం సవాల్‌గా మారుతోంది.



అనంతపురం/రాప్తాడు రూరల్: మన సంస్కృతీసంప్రదాయాలకు విరుద్ధంగా ఇటీవల చోటు చేసుకుంటున్న కొన్ని సంఘటనలు సమాజాన్ని కలవరపెడుతున్నాయి. పెళ్లయిన వ్యక్తుల వెంట పెళ్లికాని అమ్మాయిలు వెళ్తుండడం, మరోవైపు పెళ్లయిన మహిళలు సైతం పెళ్లయిన మరో వ్యక్తితో సహజీవనం చేసేందుకు ఆసక్తి చూపుతుండడం ఆందోళన కలిగిస్తున్నాయని పోలీసు అధికారులు అంటున్నారు. ఇటీవల అనంతపురం రూరల్ పరిధిలోని అక్కంపల్లి పంచాయతీకి చెందిన కుమ్మర సురేష్‌బాబు భార్య అనిత అదే కాలనీకి చెందిన బాబాఫక్రుద్దీన్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. తమ ఆనందానికి అడ్డువస్తున్నాడనే కారణంతో ప్రియుడిని ప్రేరేపించి భర్తను అంతమొందించింది. అలాగే పెళ్లయి ఇద్దరు పిల్లలు, భర్త ఉన్న మరో మహిళ...పెళ్లయి ఇద్దరు పిల్లలున్న మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుని అతడితో వెళ్లిపోయింది. ఇటీవల కూడేరు మండల పరిధిలో దారుణహత్యకు గురైన బాలిక...పెళ్లయిన వ్యక్తితో ప్రేమాయణం నడిపినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇలాంటి ఘటనలు సమాజాన్ని కలవరపెడుతున్నాయి. మూడుముళ్ల బంధానికి విలువ లేకుండా చేస్తున్నాయంటూ పలువురు వాపోతున్నారు.

225 మంది మాయం..

మహిళల అదృశ్యాలకు ప్రధానంగా ప్రేమ వ్యవహారాలు, వివాహేతర సంబంధాలే కారణమని పోలీసులు చెబుతున్నారు. యువతుల్లో ఎక్కువ మంది ప్రేమికుడిని దక్కించుకోవడం కోసమే ఇంటి నుంచి వెళ్లిపోతున్నట్లు తెలుస్తోంది. అలాగే మధ్య వయస్కులైన మహిళలు సైతం వివాహేతర సంబంధాల కారణంగా భర్తను, పిల్లలను వదిలి వెళ్తున్నారు. మిస్సింగ్ కేసుల్లో సుమారు 75 శాతం వరకు ఈ రెండు కారణాలే ఉన్నాయని పోలీసుల రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మిస్సింగ్ కేసులు అత్యధికంగా నమోదయ్యాయి. ఒక్క ఏడాదిలోనే 225 మంది మహిళలు అదృశ్యమయ్యారు. ఇప్పటి వరకూ 155 మంది ఆచూకీ లభ్యమైంది. మిగిలిన 70 మంది ఏమయ్యారనేది మిస్టరీగానే ఉండిపోయింది. దీంతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. వీరు ప్రేమ, ఇతర కారణాలతో కావాలనే వెళ్లిపోయారా? అన్నది తెలియాల్సి ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో మానవ అక్రమ రవాణా సాగుతోందని ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చేసిన సంచలన వ్యాఖ్యలకు ఈ నెల 10తో రెండేళ్లు గడిచాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ ఏడాదిలోనే వందలాది మంది మహిళలు, యువతులు కనిపించకుండా పోవడంపై కనీసం పల్లెత్తు మాట కూడా పవన్ కళ్యాణ్ మాట్లాడకపోవడం విమర్శలకు దారి తీస్తోంది.

ప్రేమ కథావి'చిత్రం'

అనంతపురం నగర శివారులో వెలుగు చూసిన ఉదంతం ఓ కుటుంబాన్ని తలెత్తుకుని తిరగలేకుండా చేసింది. ఎంతో అన్యోన్యంగా ఉంటున్న ఇద్దరు యువతుల్లో ఒకరికి వివాహం నిశ్చయమైంది. ఆ సమయంలో వరుడికి తన స్నేహితురాలిని పరిచయం చేసింది. ఈ పరిచయాన్ని ఆమె చనువుగా మార్చుకుంది. తరచూ మొబైల్‌లో చాటింగ్‌లు చేసుకునేవారు. ఈ చాటింగ్ గమనించిన యువతి... పెళ్లికి మరింత సమయం ఉండడంతో తన స్నేహితురాలని ప్రశ్నించింది. 'మీ ఇద్దరు ప్రేమించుకుంటున్నారా? అలాంటిది ఏమైనా ఉంటే ఇప్పుడే చెబితే నేను సైడ్ అయిపోతా. మీరిద్దరూ పెళ్లి చేసుకోండి' అంటూ చెప్పింది. 'అబ్బే మా మధ్య అలాంటిదేమీ లేదు. నువ్వే పెళ్లి చేసుకుని హ్యాపీగా ఉండు' అంటూ స్నేహితురాలు నమ్మబలకడంతో నిజమేనని నమ్మి ఆ యువతి పెళ్లి చేసుకుంది. ఈ సంతోషం ఎంతో కాలమూ నిలవలేదు. నిన్ను విడిచి నేనుండలేనంటూ ఆ యువకుడిని పలుమార్లు ఫోన్లు చేసి, మెసేజ్‌లు పెట్టింది. తర్వాత తన ప్రాణ స్నేహితురాలి భర్తతో కలసి ఉడాయించింది. ఈ ఘటనతో యువతి కుటుంబం సమాజంలో తలెత్తుకుని తిరగలేని స్థితికి చేరుకుంది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు వీలైనంత త్వరలో వారిని అదుపులోకి తీసుకుంటామని చెబుతున్నారు.

పేదలకు విద్యను దూరం చేస్తున్న చంద్రబాబు

- మాజీ మంత్రి సాకే శైలజనాథ్



అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో పేద పిల్లలకు విద్య దూరమవుతోందని మాజీ మంత్రి, శింగనమల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్ విమర్శించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సుదీర్ఘకాలంగా సీఎంగా పని చేశానని చెప్పుకునే చంద్రబాబు విద్యావ్యవస్థ అభివృద్ధికి చేసిన మంచి పని అంటూ ఏ ఒక్కటీ లేదని మండిపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాల పేర్లు మార్చి అభూత కల్పన చేస్తున్న సీఎం చంద్రబాబు సిగ్గుతో తలదించుకోవాలన్నారు. పేరెంట్స్ టీచర్ మీటింగ్ జగనన్న తీసుకువచ్చిందేనన్నారు. సత్యసాయిజిల్లా కొత్త చెరువు ప్రభుత్వ హైస్కూల్‌లో తల్లిదండ్రులకు టీచర్స్ మీటింగ్‌లో పిల్లలకు పాఠాలు బోధించిన మీరు రెండు నెలల క్రితం అదే జిల్లాలో ఏడుగుర్రాలపల్లిలో 9వ తరగతి చదువుతున్న ఎస్సీ విద్యార్థినిపై మృగాళ్లు దాడి చేస్తే ఇంత వరకు బాధితురాలి గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అక్కడ బాధింపబడిన కుటుంబం మీ పార్టీకి చెందిన వారే అని ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసిన కిరాతకులు మీవారేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఓ బాధిత బాలికలకు భరోసా కల్పించలేని మీరు రాష్ట్రంలోని పేద విద్యార్థుల భవిష్యత్తుకు ఎలాంటి భరోసా కల్పిస్తారో చెప్పాలన్నారు. కుమారుడు లోకేష్ భవిష్యత్తుపై ఉన్న భరోసా పేద ప్రజలపై సీఎం చంద్రబాబుకు లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి చంద్రబాబు అసమర్థ పాలనే కారణమన్నారు.

రైల్వే స్టేషన్‌లో యువకుడి మృతి

గుత్తి: స్థానిక రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫాంపై గురువారం అర్ధరాత్రి ఓ యువకుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప అక్కడకు చేరుకుని పరిశీలించారు. లభ్యమైన ఆధారాలను బట్టి మృతుడిని వైఎస్సార్ కడప జిల్లా సింహాద్రిపురం మండలం బిదనంచెర్లకు చెందిన హిటాచీ డ్రైవర్ జగదీశ్వరరెడ్డి (32)గా గుర్తించారు. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వచ్చిన ఆయన గుత్తి రైల్వే స్టేషన్‌లో మృతి చెందినట్లుగా ప్రాథమిక దర్యాప్తులో నిర్ధారించారు. అనారోగ్యమే మృతికి కారణంగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.



మృతుడు జగదీశ్వరరెడ్డి

టీడీపీ కార్యకర్తల బాహాబాహీ

- ఎంపీడీఓ కార్యాలయం వద్ద రెండు వర్గాల తోపులాట

బ్రహ్మసముద్రం: ఉపాధి కూలీల పొట్టకొడుతూ యంత్రాలతో పని పూర్తి చేయించి బిల్లులు చేసుకునేందుకు ఓ టీడీపీ నేత అండగా నిలవగా.. అదే పార్టీకి చెందిన సీనియర్లు వ్యతిరేకించారు. దీంతో రెండు వర్గాల కార్యకర్తల ధర్నాలతో ఎంపీడీఓ కార్యాలయం దద్దరిల్లింది. వివరాలు.. బ్రహ్మసముద్రం మండలం బైరసముద్రం గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు వర్గానికి చెందిన మండల టీడీపీ కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు అండతో ఆయన అనుచరులు ఇటీవల ఉపాధి పనులను జేసీబీతో పూర్తి చేయించారు. ఈ అంశంపై అధికారులకు అదే పార్టీకి చెందిన కొందరు సీనియర్ నేతలు ఫిర్యాదు చేశారు.

అక్రమాలు కప్పిపుచ్చే ప్రయత్నం

ఉపాధి పనులపై విచారణ చేసేందుకు డ్వామా పీడీ సలీంబాషా శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్న విషయం తెలుసుకున్న శ్రీరాములు తన వర్గం వారితో కలసి అక్కడకు చేరుకుని అక్రమాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. అదే సమయంలో పార్టీ సీనియర్ నేతలు, పలువురు కార్యకర్తలు సైతం కార్యాలయానికి చేరుకున్నారు. క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టాలని సీనియర్లు డిమాండ్ చేశారు. ఆ సమయంలో వారిని శ్రీరాములు వర్గం అడ్డుకునే ప్రయత్నం చేసింది. దీంతో సీనియర్ల వర్గం కార్యాలయం ఎదుట ధర్నాకు సిద్ధం కావడంతో శ్రీరాములు వర్గీయులు ప్రతిఘటించారు. ఒకానొక దశలో ఇరువర్గాల మధ్య తోపులాట చోటు చేసుకుని పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీసింది. పరిస్థితి చేజారిపోకుండా ఉండేందుకు అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణకు సిద్ధమయ్యారు.



జేసీబీతో పూర్తి చేసిన ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ సలీంబాషా

పీడీకి సహకరించని క్షేత్ర సిబ్బంది

యంత్రాలతో పూర్తి చేసిన పనులను డ్వామా పీడీ సలీంబాషా పరిశీలించి, కొలతలు సిద్ధమయ్యారు. ఆ సయయంలో రికార్డులు, టేప్ తీసుకురావాలని ఉపాధి ఈసీ జయప్రకాష్ బీఎఫ్‌టీ వన్నూరుస్వామి సూచించినా వారు పట్టించుకోలేదు. విచారణను పెడదోవ పట్టించేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. దీంతో పీడీ అసహనం వ్యక్తం చేశారు. అదే సమయంలో గ్రామస్తులు రెండు వర్గాలుగా విడిపోయి అధికారుల సమక్షంలో మరోసారి వాగ్వాదానికి దిగారు. ఈ ఏడాదిలో ఉపాధి హామీ పథకం కింద గ్రామంలో చేపట్టిన ప్రతి పనిపై సమగ్ర విచారణ చేపట్టాలని పలువురు డిమాండ్ చేశారు.



'ఫీజు' కోసం కదం తొక్కిన విద్యార్థులు

- ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా
- పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమొద్దని కూటమి సర్కార్‌కు హితవు
- ఫీజు రీయింబర్స్ చేయకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక



కలెక్టరేట్ ఎదుట విద్యార్థుల ధర్నాలో మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి

అనంతపురం అర్బన్: ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయాలంటూ విద్యార్థులు కదం తొక్కారు. పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమొద్దని కూటమి ప్రభుత్వానికి హితవు పలికారు. కాదూకూడదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలంటూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట విద్యార్థులు ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. విద్యార్థులు ఆందోళనకు ఏఐఎస్‌ఎఫ్ మాజీ నాయకుడు రమణయ్య సంఘీభావం ప్రకటించారు. ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డితో పాటు రాష్ట్ర సహాయ కార్యదర్శి కుళ్లాయిస్వామి మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేసి విద్యార్థుల ఖాతాల్లో జమ చేస్తామని ఎన్నికల సమయంలో నారా లోకేష్ స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాది దాటినా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎందుకు జమ చేయలేదంటూ ప్రశ్నించారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో ప్రకటించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ కేవలం ప్రకటనలకే పరిమితం చేశారంటూ మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్ చేయకపోవడంతో డిగ్రీ, ఇంజనీరింగ్ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ఫలితంగా ఉద్యోగ అవకాశాలను కోల్పోవాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నత చదువులకు పేద విద్యార్థులను దూరం చేసే జీఓ 77ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్మీడియేట్ ఫలితాలు వెల్లడై మూడు నెలలు అవుతున్నా నేటికీ డిగ్రీ ప్రవేశాలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల సమయాన్ని పాత విధానంలోనే కొనసాగించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం డీఆర్‌ఓ ఎ.మలోలను ఆయన చాంబర్‌లో నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయుడు, కోశాధికారి ఆంజనేయులు, నాయకులు వెంకట్‌నాయక్, నరసింహయాదవ్, మంజునాథ్, వంశీచంద్, ఉమమహేష్, మాళి, వినోద్, నానీ, సమీర్, రాజేష్, రాజు, పవన్, తరుణ్, బాబ్జాన్, దిలీప్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల వేధింపులు తాళలేక..

గుంతకల్లు/టౌన్: అధికారుల వేధింపులు తాళలేక విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం చేశారు. బాధితుని బంధువులు, తోటి ఉద్యోగులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని బ్యాంక్ కాలనీలో నివాసముంటున్న అన్సార్ గతంలో గుత్తి ట్రాన్స్‌కో పరిధిలోని ఆర్‌టీఎస్ఎస్ (220కె.వి)లో కాంట్రాక్ట్ హెల్పర్‌గా పనిచేసేవాడు. పరస్పర బదిలీల్లో భాగంగా తకల్లులోని ఆలూరు రోడ్డులో ఉన్న 132కేవీ సబ్‌స్టేషన్‌కు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న రమేష్‌ను గుత్తికి బదిలీ చేశారు. అయితే ఈ బదిలీల్లో తనకు అన్యాయం జరిగిందని ఓ సహోద్యోగి ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించాడు. దీంతో సంబంధిత ట్రాన్స్‌కో అధికారులు అన్సార్‌ను తిరిగి గుత్తికి వెళ్లిపోవాలని తీవ్రంగా ఒత్తిడి చేయడంతో మనస్తాపం చెందిన ఆయన శుక్రవారం విధుల్లో ఉన్న సమయంలోనే పురుగుల మందు తాగాడు. గమనించిన తోటి ఉద్యోగులు వెంటనే 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి వైద్యులు రెఫర్ చేశారు. తాము ఆస్పత్రికి వెళ్లేలోపు అతడిని రెఫర్ చేశారని, ఆత్మహత్యాయత్నానికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉందని వన్‌టౌన్ పోలీసులు చెప్పారు. ఈ ఘటనపై సంబంధిత ట్రాన్స్‌కో అధికారిని వివరణ కోరేందుకు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు.



చికిత్స పొందుతున్న అన్సార్



వ్యక్తి ఆత్మహత్య

శింగనమల: మండలంలోని కొరివిపల్లికి చెందిన జగన్నాథరెడ్డి(42) ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతపురంలోని గృహ నిర్మాణ శాఖలో కంప్యూటర్ అపరేటర్‌గా పని చేస్తున్నారు. అనంతపురంలోనే భార్య, కుమారుడితో కలసి తన సొంత ఇంట్లోనే నివాసం ఉంటున్నారు. ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఆయన శుక్రవారం తన తోటలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయభాస్కర్ తెలిపారు.



జగన్నాథరెడ్డి (ఫైల్)

నేడు కేంద్ర సహాయ మంత్రి గుంతకల్లుకు రాక

గుంతకల్లు: కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ శనివారం గుంతకల్లుకు రానున్నారు. 16వ రోజ్‌గారి మేళా కింద ఎంపికైనా కేంద్ర ప్రభుత్వ నూతన ఉద్యోగులకు ఈ సందర్భంగా ఆయన నియామక పత్రాలను అందజేయనున్నారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఆందోళన చేస్తే.. అక్రమ కేసులే!

- తమ్ముళ్లకే ఝలక్ ఇచ్చిన పోలీసులు



అనంతపురం క్రైం: ఆందోళనలు చేస్తే అక్రమ కేసులు బనాయిస్తామంటూ తమ్ముళ్లకు పోలీసులు ఝలక్ ఇచ్చారు. వివరాలు ఇలా.. కార్యకర్తలు, ద్వితీయశ్రేణి నేతలను పట్టించుకోకపోవడంతో తీవ్ర అసహనానికి గురైన అనంతపురం నియోజకవర్గానికి చెందిన కొందరు టీడీపీ కార్యకర్తలు ఈ నెల 14న ఆర్ఎఫ్ రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ముద్రించిన కరపత్రాలను శుక్రవారం ఆ పార్టీకి చెందిన కార్యకర్త రంగాతో పాటు మరికొందరు విడుదల చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు వెంటనే రంగాను అదుపులోకి తీసుకుని, కరపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధికి వ్యతిరేకంగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా పీడీ యాక్ట్ కింద జిల్లా బహిష్కరణ వేటు వేస్తామని, గంజాయి విక్రయాలు సాగిస్తున్నట్లు కేసులు నమోదు చేస్తామని బెదిరింపులకు దిగారు. దీంతో రంగా అసహనం వ్యక్తం చేస్తూ పార్టీ గెలుపు కోసం కష్టపడినందుకు జైళ్లకు పంపుతామంటే తాము సిద్ధమని పేర్కొన్నాడు. ఎవరు అడ్డుకున్నా నిర్ణీత సమయానికి దీక్ష చేపట్టి తీరుతామని స్పష్టం చేశాడు. దీంతో పోలీసులు కేసు బనాయించేందుకు సిద్ధమవుతుండగా టీడీపీ కీలక నేత ఫోన్ చేసి వాగ్వాదానికి దిగడంతో వెనక్కు తగ్గినట్లు తెలిసింది.

వన్‌టౌన్ నుంచి బయటకు రాగానే

నిరసన పోస్టరుపై నగరంలోని నాలుగు స్టేషన్ల పోలీసులు స్పందించడం గమనార్హం. రంగా ఎక్కడున్నావంటూ ఒకరి తర్వాత ఒకరు ఫోన్లలో ఆరా తీశారు. వన్‌టౌన్ నుంచి ఇప్పుడే ఇంటికొచ్చానని చెప్పడంతో స్టేషన్‌కు రావాల్సిందేనని హుకుం జారీ చేశారు. అలా మూడు స్టేషన్లను చుట్టి ఇంటికి చేరుకున్న రంగా తనకు ప్రాణహాని తప్పదనే భావనకు వచ్చేశాడు. ఇదే విషయాన్ని రాష్ట్ర స్థాయి నేతలకు ఆయన ఫోన్ చేసి తెలిపినట్లు సమాచారం.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

అడ్మిషన్స్

■ APNCET (నర్సింగ్ సెట్) లో క్వాలిఫై కానీ స్టూడెంట్స్ కి B.Sc (MLT), BPT (ఫిజియోథెరపీ) కి గవర్నమెంట్ సీట్స్ కి అడ్మిషన్స్ జరుగుచున్నవి. Cont : G.MURALI, 9030661651, అనంతపురం. [A-7135]

GNM అడ్మిషన్స్

■ ఇంటర్మీడియట్ లో Any Group పాస్ స్టూడెంట్స్ కి G.N.M (Nursing) కి గవర్నమెంట్ సీట్స్ కలవు. అనంతపురం నందు గల గర్ల్స్ కాలేజీ లో అడ్మిషన్స్ పొందవచ్చు. సంప్ర: G. మురళి, 9030661651, అనంతపురము. [A-7431]

REAL ESTATE

LEASE / RENT

■ ANANTAPUR HOUSING BOARD COLONY MPDO OFFICE BACK SIDE EAST FACE 1st FLOOR 2BHK (OFFICE, CLINIC Playschool) LEASE / RENT 9849463347. [SCA25006152]

SERVICES

ASTROLOGY

■ శ్రీ దుర్గాదేవి జ్యోతిష్యాలయం పండిత్ యస్. రాఘవేంద్ర శాస్త్రిగారు మీ సమస్యలకు ఫోన్ ద్వారా పరిష్కార మార్గం చెప్పబడును. స్త్రీ పురుషులకు ఎటువంటి కఠిన సమస్యలున్న దుర్గా దేవి పూజ హోమం ద్వారా శాస్వత పరిష్కారం చూపించబడును. 9948667577. [G-643]

WANTED

■ అనంతపురం, గార్లదిన్నె బత్తాయి తోటలో పనిచేయుటకు/ ఫ్యామిలీ కావలెను. రూం + కరెంటు, భోజన వసతి కలదు. జీతం: రూ।। 14000/- సెల్ : 78010 11377. [A-1666]

■ ప్రముఖ MNC కంపెనీలో వర్క్ చేయుటకు అనుభవం కలిగిన యువతీ యువకులు కావలెను. అర్హతః - డిగ్రీ, జీతంః- 20 వేల వరకు. సంప్ర।। 9908429239 [G-646]

■ Wanted Sales Manager and assistant sales manager in popular mobile stores are preferable. Ph.No: 9133399257, 9703333378. [G-145]

■ ATP లోకల్‌లో ఇల్లు, ఆఫీస్‌లు ట్యాంక్‌లు, సంపులు, వాష్ రూమ్స్ క్లీనింగ్ బాయ్స్-2 & సేల్స్ మెన్ కావలెను. సెల్ : 9705819121. [SCA25005918]

■ Opportunity for Male Managers with good pay in Naturals Saloon A. 20-30 should understand. Hindi, Sainagar, Atp. 8096000222 [SCA25006153]

■ డ్రైవర్స్ కావలెను. డ్రైవింగ్ లైసెన్స్, EXP: 3 సం: విద్యార్హత : 10th పాస్/ ఫెయిల్. వయస్సు: 20-35 సం.లోపు, జీతం: ₹15,500+ PF+ESIC, TA, O.T, భోజన సదుపాయం కలవు. # SDT రైడర్స్ లాజిస్టిక్స్ ప్రై.లి. హుండాయ్ గ్లోవిస్ &VPC, కియా, పెనుగొండ. 9066192421, 9390490947. [A-7136]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ బిల్ ఇన్ ఫ్రా నందు పనిచేయుటకు, అనుభవం గల టెలికాలర్స్ (స్త్రీలు) & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. టీమ్‌తో వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యత. టార్గెట్‌తో పనిలేకుండా ఫిక్స్‌డ్ జీతం ఇవ్వబడును. అడ్రస్: 1వ ఫ్లోర్, సహస్రా అపార్ట్‌మెంట్, బళ్ళారి రోడ్, అనంతపురం.సెల్: 9989452444. [A-1667]

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!

4 లైన్లు రూ॥ 270/-
అదనపు లైను రూ॥ 60/-
(GST 5% అదనం)
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం

→ అర్థిక
→ అమ్మకం
→ రియల్ ఎస్టేట్
→ ఫర్నీచర్స్
→ ఆటోమొబైల్
→ కంప్యూటర్స్
→ సర్వీసెస్
→ కావలెను

ANANTHAPURAMU : 9010567770, 9492288307
DHARMAVARAM & PUTTAPARTHI : 9912220726, 7093150088
HINDUPUR & MADAKASIRA : 9912220723, 9494767933
GUNTAKAL & TADIPATRI : 9912220722
KADIRI : 7093150088 RAYADURG : 9010470185

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) | సిండికేట్ Syndicate

స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎమ్. బ్రాంచ్
కెపిసి ఆర్కేడ్, 3వ అంతస్తు, 13-1 ఆర్‌సి రోడ్డు, వాణి నగర్, అలిపిరి, తిరుపతి-517501. ✆ 7901626759

స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని 8(6) & 9(1) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/హామీదారులు చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతికంగా స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది 29.07.2025 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది: 29.07.2025. ఉ॥ 10.30 గం.ల నుండి ఉ॥ 11.30 గం.ల వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet.com) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 28/07/2025, సా॥ 4.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

1 ఋణగ్రహీత(లు): శ్రీ ఎస్.వి. బ్రహ్మానంద రెడ్డి, తండ్రి: ఎస్. వరదా రెడ్డి, ఫ్లాట్ నెం.7, 3వ అంతస్తు, కొత్తబంగారులోకం అపార్ట్‌మెంట్, పోలీసు స్టేషన్ ఎదురుగా, తాడిపత్రి-515411, మరియొక చిరునామా: డి.నెం. 8, 10వ క్రాస్, 6వ మెయిన్ అలనహళ్లి లే-అవుట్, లలిత మహల్ దగ్గర, మైసూర్, కర్ణాటక-570008. బకాయి మొత్తం: తేది 27.06.2025 నాటికి రూ. 46,51,371.45/- + తేది. 28.06.2025 నుండి తదుపరి వడ్డీ, వ్యయాలు & ఇతర ఛార్జీలు.

బ్యాంకుకు తెలిసిన సమాచారం ప్రకారం ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్‌లు లేని స్థిరాస్తి వివరములు :

షెడ్యూలు-ఎ: అనంతపురం జిల్లా, తాడిపత్రి మండలం, తాడిపత్రి గ్రామ ఫీల్డ్స్, గన్నేవారిపల్లి గ్రామ పంచాయతీ ఏరియా, సర్వే నెం. 942 నందు మొత్తం 1392 చ॥గ॥లో అనుపాత అవిభాజ్యపు స్థలం 48.42 చ॥గ॥ వాటాతో 3వ అంతస్తులోని ఫ్లాట్ నెం. 7. కొలతలు: తూర్పు-పడమర: ఉత్తరంవైపుగా 68 అ॥, తూర్పు-పడమర: దక్షిణంవైపుగా 63 అ॥, ఉత్తరం-దక్షిణం: తూర్పువైపుగా 191 అ॥, ఉత్తరం-దక్షిణం: పడమరవైపుగా 187 అ॥. కొత్తబంగారులోకం అపార్ట్‌మెంట్‌కు హద్దులు: తూర్పు: 16'0" వెడల్పు రోడ్డు, పడమర: సర్వే నెం. 940 (బంబులపాడు రస్తా), ఉత్తరం: రామాంజుల రెడ్డి భూమి, దక్షిణం: సర్వే నెం. 941 లోని మున్సిపాలిటీ భూమి. షెడ్యూలు-బి: "కొత్త బంగారు లోకం" అపార్ట్‌మెంట్, 3వ అంతస్తులోని ఫ్లాట్ నెం.7. హద్దులు: తూర్పు: వరండా, పడమర: బహిరంగ ప్రదేశం, ఉత్తరం: బహిరంగ ప్రదేశం, దక్షిణం: బహిరంగ ప్రదేశం. మొత్తం ఫ్లింత్ ఏరియా 38.272 చ॥అ॥లో 1110.15 చ॥అ॥ (1355 చ॥అ॥ ఉమ్మడి ఏరియాలు కలుపుకొని). కొలతలు: తూర్పు-పడమర: 25.37 అ॥, ఉత్తరం-దక్షిణం: 43.7 ½ అ॥.

రిజర్వు ధర: రూ. 9,80,000/-	ధరావత్తు సొమ్ము: రూ. 98,000/-

గమనిక: బ్యాంకుకు తెలిసి/తెలియని బకాయిలు/ట్యాక్సులు ఏమైనా ఉన్నచో వేలం కొనుగోలుదారు మాత్రమే వాటిని భరించవలసి ఉంటుంది మరియు చివరి మొత్తం బిడ్డు సొమ్ముకు అది అదనం.

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, తిరుపతి స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎమ్ బ్రాంచ్, అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 7901626759, 9901574353.

ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (BAANKNET), వెబ్‌పోర్టల్ https://www.baanknet.com/ ఫోన్ నెం: 7046612345 / 6354910172 / 8291220220 / 9892219848 / 8160205051, ఇ-మెయిల్: support.BAANKNET@psballiance.com

తేది: 11.07.2025, ప్రదేశం: తిరుపతి — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

క్లుప్తంగా

అంగన్‌వాడీల తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రంలో సమస్యలు తెలుసుకుంటున్న సీఎస్‌టీడీ లక్ష్మీదేవి

ఆత్మకూరు: అంగన్‌వాడీల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, సరుకులు లబ్ధిదారులకు సక్రమంగా అందించాలని సీఎస్‌డీటీ లక్ష్మీదేవి సూచించారు. శుక్రవారం మండలంలోని గొరిదిండ్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. స్టాక్‌ను పరిశీలించి.. ఎంత మేరకు లబ్ధిదారులకు అందజేశారని ఆరా తీశారు. సకాలంలో గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ రఫి పాల్గొన్నారు.

వాహనాల వేలం

అనంతపురం: డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ అనంతపురం, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అనంతపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో స్వాధీనం చేసుకున్న 8 వాహనాలను వేలం వేశారు. ఈ వాహనాల ద్వారా రూ.97,400 ఆదాయం సమకూరింది. వీటి మీద జీఎస్టీ రూ.17,532 చెల్లించారు.

'దాడులకు భయపడే ప్రసక్తే లేదు'



కార్యకర్తలను పరామర్శిస్తున్న పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు నాయక్

అనంతపురం కార్పొరేషన్: రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో కూటమి ప్రభుత్వంలో తెలుగు తమ్ముళ్ల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ప్రజలు తిరుగుబాటు చేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు నాయక్ పేర్కొన్నారు. ఇటీవల బీకేఎస్ మండలం చెన్నంపల్లిలో టీడీపీ నాయకులు దాడిలో గాయపడి ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను పరామర్శించారు. టీడీపీ నాయకులు దౌర్జన్యాలు చేస్తున్నా.. పోలీసులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారన్నారు. ఎవరెన్ని దాడులు, దౌర్జన్యాలు చేసినా భయపడే ప్రసక్తే లేదని తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతిలోనే ప్రభుత్వానికి బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్వీ నారాయణ, సాకే ఆనంద్, సాకే పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ కాలనీలో అగ్నిప్రమాదం

అనంతపురం: నగరంలోని రెవెన్యూ కాలనీలో శుక్రవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. భారతి అనే మహిళ నిర్వహిస్తున్న కుట్టు మిషన్, చీరల దుకాణం దగ్ధమైంది. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.2.70 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితురాలు తెలిపింది.

ముదార్ సేవలు ఆదర్శప్రాయం



ముదార్ వేణుగోపాల్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

అనంతపురం కల్చరల్: ఉద్యమ నాయకుడిగా, ప్రజాకవిగా, పెన్షనర్స్ సంఘం వ్యవస్థాపకుడిగా సేవలందించిన ముదార్ వేణుగోపాల్ 5వ వర్ధంతిని శనివారం ప్రజా, సాహితీ సంస్థల ప్రతినిధులు జరుపుకున్నారు. కోవూరు నగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ప్రజలతో మమేకమైన ఆయన జీవితాన్ని స్మరించుకున్నారు. పాలకుల నిరంకుశత్వాన్ని నిగ్గదీసి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమై కనిపించాడన్నారు. విశ్రాంత ఉద్యోగులకు నాయకుడై నడిపించిన తీరు ఆదర్శప్రాయమని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ విరసం సభ్యుడు జెట్టీ జైరామ్, తెలుగు వెలుగు టీవీ రెడ్డి, ఉమర్ ఆలీషా సాహితీ సమితి ప్రతినిధులు జూటూరు షరీఫ్, రియాజుద్దీన్, సంపాదకులు తోటనాగరాజు, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ప్రభాకర గుప్తా తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్యాయత్నం

అనంతపురం: నగరంలో వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాలు.. బుక్కరాయసముద్రానికి చెందిన మహబూబ్ బాషా కలెక్టర్ ఆఫీసు వద్ద టీ స్టాల్ నిర్వహిస్తున్నాడు. రామాంజి అనే వడ్డీ వ్యాపారి వద్ద రూ.లక్ష అప్పు చేశాడు. రూ.100కు రూ.10 చొప్పున మూడు నెలలుగా వడ్డీ సక్రమంగా చెల్లించాడు. అయితే అసలు, వడ్డీ తక్షణమే చెల్లించాలని వడ్డీ వ్యాపారి ఒత్తిడి చేశాడు. వేధింపులు భరించలేక మహబూబ్ బాషా విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇతడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు.

భక్తిశ్రద్ధలతో జలధి

ఆత్మకూరు: మండలంలోని తోపుదుర్తి, సింగంపల్లి గ్రామాల్లో మొహర్రం వేడుకల్లో భాగంగా శుక్రవారం భక్తిశ్రద్ధలతో జలధి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్ల స్వాములకు భక్తులు చక్కెర చదివింపులు చేయించారు. అనంతరం డప్పుచప్పుళ్ల మధ్య పీర్ల స్వాములను జలధికి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.



తోపుదుర్తిలో జలధికి తరలుతున్న పీర్లు



సింగంపల్లిలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

జేఎన్‌టీయూకు సైకిళ్ల వితరణ



సైకిళ్లు తొక్కుతున్న వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శన రావు, తదితరులు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలకు యూనియన్ బ్యాంక్ సోషియల్ ఫౌండేషన్ ట్రస్టు (ముంబై) 30 సైకిళ్లు వితరణ చేశారు. వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణయ్య చేతుల మీదుగా బాయ్స్‌కు 15, గరల్స్‌కు 15 సైకిళ్లు అందజేశారు. ఈ సైకిళ్లను క్యాంపస్‌లో తిరగడానికి వీలుగా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ జితేంద్ర కుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించండి

రాప్తాడు: పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ పురోగతి సమీక్ష 2.0పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ.. పంచాయతీలోని గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మి, ఏఓ క్రిష్ణ చైతన్య, ఈఓఆర్డీ ఆనంద ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనూరాధ, ఏపీఎం సునీత, సీహెచ్‌ఓ శ్రీనివాసులు పంచాయతీ కార్యదర్శులు, డీజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండలంలోని పంచాయతీ అభివృద్ధికి అందరం కృషి చేద్దామని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయలక్ష్మి సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ పురోగతి సమీక్ష 2.0పై సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీల్లో ఏ సమస్యలు ఉన్నాయి? ఎలా పరిష్కారం అవుతాయి? అన్న అంశంపై ప్రజా ప్రతినిధులతో కలిసి చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శివకుమార్, పంచాయతీ ఇంజినీర్ పార్థసారథి, హౌసింగ్ ఏఈ జమీల్ అహమ్మద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

'అమ్మఒడి' రూపకర్త వైఎస్ జగన్

అనంతపురం ఎడ్యుకేషన్: పేద విద్యార్థుల కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన 'అమ్మఒడి' పథకాన్ని మంత్రి నారా లోకేష్ కాపీ కొట్టి 'తల్లికి వందనం'గా మార్చారని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తల్లికి వందనం పథకం ఆలోచన నారా లోకేష్‌దే అని సీఎం చంద్రబాబు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. తనయుడి గురించి గొప్పలు చెప్పే క్రమంలో చంద్రబాబు నవ్వులపాలయ్యారన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి హయాంలో విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పుతో 'అమ్మ ఒడి' పథకానికి రూపకల్పన చేశారన్నారు. ఆ పథకాన్ని నవరత్నాల్లో చేర్చి 2019లోకి అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేశారని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో అమ్మఒడి పథకాన్ని పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అమలు చేస్తే ఈ ప్రభుత్వంలో 'తల్లికి వందనం' పథకానికి అనేక కొర్రీలు పెడుతూ అర్హులైన వారికి కూడా అమలు చేయడం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను లక్ష్యంగా చేసుకుని అనర్హుల జాబితాలో చేర్చారని మండిపడ్డారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తాము చేసింది చెప్పుకోవాలని ఏమాత్రం సంబంధం లేని వాటి గురించి మాట్లాడితే మళ్లీ నవ్వులపాలు కాక తప్పదన్నారు.

సమయపాలన పాటించకపోతే చర్యలు

రాప్తాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని అనంతపురం రూరల్ ప్రాజెక్ట్ సీడీపీఓ ఉమా శంకరమ్మ పేర్కొన్నారు. శుక్రవారం ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్ అంగన్‌వాడీ కేంద్రం–1ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కేంద్రంలో రికార్డులతో పాటు ఫుడ్‌స్టాక్‌ను పరిశీలించారు. పిల్లలతో రెయిమ్స్ చెప్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మూడు నుంచి ఐదేళ్లలోపు చిన్నారులను విధిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. ఇక్కడ ఆటపాటలతో కూడిన విద్యతో పాటు సకాలంలో పౌష్టికాహారం అందించి చిన్నారులు ఆరోగ్యకరంగా ఎదిగేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. పోషక విలువలున్న ఆహారం అందించడం ద్వారా పిల్లల్లో రక్తహీనత సమస్య తలెత్తదని పేర్కొన్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ముఖ ఆధారిత గుర్తింపు ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేయాలన్నారు. ముఖ ఆధారితహాజరుపై నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ఒక్కరూ నమోదు చేయాలన్నారు. పని వేళల్లో రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు. సమయ పాలన పాటించని వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త దండు యల్లమ్మ, అంగన్‌వాడీ సహాయకురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న సీడీపీఓ ఉమా శంకరమ్మ

అనంత వేదికగా జాతీయ నృత్యోత్సవం

- 'సంధ్యారవళి' పేరుతో నేటి నుంచి రెండు రోజుల నిర్వహణ
- వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు చేరుకున్న కళాకారులు

అనంతపురం కల్చరల్: అనంత వేదికగా మరోసారి ఏకబిగిన 12 గంటల నిర్విరామ నాట్యోత్సవం జరుగనుంది. శాస్త్రీయ నృత్యంలో అద్భుతాలు సృష్టిస్తూ అనంత ఖ్యాతిని ద్విగుణీకృతం చేసిన నాట్యాచార్యులు సంధ్యామూర్తి శిష్య బృందం శని, ఆదివారాల్లో నృత ప్రదర్శనలు ఇవ్వనున్నారు. 'సంధ్యారవళి' పేరిట సాగే నృత్యోత్సవంలో పాల్గొనేందుకు ఇప్పటికే వివిధ ప్రాంతాల నుంచి శాస్త్రీయ నృత్య కళాకారులు జిల్లాకు చేరుకున్నారు. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానాల కల్యాణ మండపంలో స్థానిక చిన్నారులు పలు శాస్త్రీయ నాట్యం చేస్తారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్విరామంగా వందల సంఖ్యలో కళాకారులు వివిధ నాట్య రీతులను ప్రదర్శిస్తారు. ఇందులో భాగంగా వివిధ రాష్ట్రాల నుంచి అనంత నాట్యోత్సవంలో పాల్గొనే గురువులను 'నర్తన ఆచార్య' అవార్డులు, నాట్య కళాకారులకు 'నర్తన బాల' అవార్డులతో గౌరవించనున్నారు. నాట్యోత్సవాలను విజయవంతం చేయాలని సంధ్యామూర్తి కోరారు.



నృత్య సాధన చేస్తున్న సంధ్యామూర్తి

ప్రణాళికాబద్ధమైన కుటుంబం శ్రేయస్కరం

- డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి

అనంతపురం కార్పొరేషన్: ఓ నిర్దిష్ట ప్రణాళికాబద్ధమైన కుటుంబం ఎంతో శ్రేయస్కరమని డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి అభిప్రాయపడ్డారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగి తిరిగి డీఎంహెచ్ఓ కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడారు. ఈ ఏడాది ప్రణాళికాబద్ధమైన మాతృత్వం కోసం గర్భధారణల మధ్య ఆరోగ్యకరమైన సమయం, అంతరం, అవసరమన్న నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళుతున్నట్లు పేర్కొన్నారు. యువ జనాభా సంఖ్య తగ్గుతున్న కారణంగా దంపతులు తప్పనిసరిగా సంతానాన్ని పొందాలన్నారు. బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలన్నారు. అనంతరం ముగ్గురు పిల్లలు కలిగిన దంపతులను లాటరీ ద్వారా ఎంపిక చేసి, అలాగే కుటుంబ నియంత్రణ తాత్కాలిక పద్ధతిని పాటించిన ఇద్దరికి రూ.5వేలు (ఒక్కొక్కరికి), కుటుంబ నియంత్రణ శాశ్వత పద్ధతులు చేసుకున్న వారికి ఒక్కొక్కరికి రూ.5వేలు, గైనకాలజిస్టుకు రూ.8 వేలు, ఏఎన్ఎంలకు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా, ఆర్ఎంఎన్‌సీఏస్ కౌన్సెలర్లకు రూ.2,500 పారితోషికం అందించారు. కార్యక్రమంలో ఎస్ఓ మహమ్మద్ రఫీ, హెచ్ఈఈఓ నాగరాజు, డెమో త్యాగరాజు, డిప్యూటీ హెచ్ఈఓ గంగాధర్ పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి

15న చలో విజయవాడ



మునిసిపల్ ఆర్‌డీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

అనంతపురం కార్పొరేషన్: మునిసిపల్ కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం మునిసిపల్ ఆర్‌డీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులకు రూ.21 వేలు వేతనం ఇస్తున్నారని.. ఇంజినీరింగ్ కార్మికులకు రూ.15 వేలు మాత్రమే అందుతోందన్నారు. ఇంజినీరింగ్ కార్మికుల వేతనాన్ని పెంచాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు సీనియర్లను శాశ్వత ఉద్యోగులకు గుర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈనెల 15న చలో విజయవాడ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజారెడ్డి, రాజేష్‌గౌడ్, చిరంజీవి, కృష్ణుడు, వేణుగోపాల్, ప్రసాద్, శివకృష్ణ, నాయుడు, నాగేంద్ర బాబు, రఫి, అసేన్, కుళ్లాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

అనంతపురం కార్పొరేషన్: 'నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి. కార్మికుల సమ్మెకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి' అని కార్మిక, ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఈనెల 12వ తేదీ అర్ధరాత్రి నుంచి చేపడుతున్న నిరవధిక సమ్మెకు తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా తాగునీరు, వీధి లైట్లు తదితర సేవలకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలన్నారు. సమావేశంలో సీఐటీయూ నాగేంద్ర కుమార్, ఐఎఫ్‌టీయూ యేసురత్నం, వైఎస్సార్‌టీయూ అనిల్ కుమార్, రైతు సంఘం చంద్రశేఖర్ రెడ్డి, కేవీపీఎస్ వెంకటేష్, ఐద్వా శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్న పోలీసులు

పామిడి: స్థానిక పి.కొండాపురం క్రాస్ సమీపంలో శుక్రవారం రైలు పట్టాల వద్ద విషపూరిత ద్రావకంతో పాటు విషపు గుళికలు మింగబోతున్న బుక్కరాయసముద్రం నివాసి రమేష్‌నాయుడిని పోలీసులు సకాలంలో గుర్తించి, కాపాడారు. అనంతపురంలో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న రమేష్‌నాయుడు కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమయ్యాడంటూ స్నేహితుల నుంచి సమాచారం అందుకున్న పామిడి పోలీసులు అప్రమత్తమయ్యారు. సీఐ యుగంధర్ నేతృత్వంలో గాలింపు చేపట్టి విషపు గుళికలు మింగబోతుండగా అడ్డుకుని ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం కుటుంబసభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం అప్పగించారు.

శాకంబరిగా చౌడేశ్వరి మాత



అలంకరణలో చౌడేశ్వరి మాత



సాయినగర్‌లో పూజలందుకున్న కనకదుర్గ

అనంతపురం కల్చరల్: మొదటి రోడ్డులో వెలసిన రామలింగ చౌడేశ్వరి దేవి విశేష అలంకార సేవల్లో దర్శనమిచ్చారు. ఆషాఢంలో వచ్చిన పవిత్ర శుక్రవారం అమ్మవారు వివిధ రకాల కూరగాయలతో శాకంబరి దేవి అలంకారంలో పూజలందుకుంది. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి సామూహిక పారాయణంలో పాల్గొన్నారు. అలాగే శివబాలయోగి ఆశ్రమం, కొత్తూరు అమ్మవారి శాల, వలీస్వామి ఆశ్రమం, సాయినగర్‌లోని కనకదుర్గ అమ్మవారు, శారదా శంకర మఠంలో శారదామాత విశేష పూజలందుకున్నారు. ఈ సందర్భంగా సాగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పంటల బీమా గడువు పొడిగించాలి

అనంతపురం అర్బన్: వాతావరణ ఆధారిత పంటల బీమా ప్రీమియం చెల్లింపు గడువు ఈనెల 30వ తేదీ వరకు పొడిగించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. రైతులను ఆదుకునేందుకు బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలని కమిటీ కోరింది. శుక్రవారం స్థానిక సంఘం కార్యాలయంలో జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో రైతులు ఆర్థిక ఇబ్బందులో ఉన్నారన్నారు. వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వలేదన్నారు. బీమా చెల్లించేందుకు కూడా డబ్బులు లేని పరిస్థితిలో రైతులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రధానమంత్రి ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత పంటల బీమా ప్రీమియం వేరుశనగకు ఎకరాకు రూ.640, పత్తికి ఎకరాకు రూ.1,900, చీని పంటకు ఎకరాకు రూ.2,750, టమాటకు ఎకరాకు రూ.1,600 చెల్లించాల్సి ఉందన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చెల్లించలేక పంటల బీమాలో రైతులు చేరలేక నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన పీఎం ఫసల్‌బీమా ప్రీమియం రద్దు చేసి ఉచిత పంటల బీమా పథకం అమలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. బీమా ప్రీమియం భారం రైతులపై పడకుండా ప్రభుత్వమే చెల్లించాలన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు సురక్షితం

రాప్తాడు: 'ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు సురక్షితం. సుఖ ప్రసవం కోసం హైరిస్క్ గర్భిణులు పౌష్టికాహారం తీసుకుని జాగ్రత్తలు తప్పక పాటించాలి' అని పీహెచ్‌సీ వైద్యాధికారి శివ కృష్ణ తెలిపారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో మండలంలోని హైరిస్క్ గర్భిణులకు రక్త పరీక్ష, బీపీ, దయాబెటిస్, హిమోగ్లోబిన్ తదితర వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. గర్భిణులకు ప్రభుత్వ ఆస్పత్రిలోనే సురక్షిత కాన్పులు చేస్తారని తెలిపారు. ఒక్క పైసా కూడా వారికి ఖర్చు కాదన్నారు. గర్భిణులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తే చాలా ఖర్చు అవుతుందని పేర్కొన్నారు. గర్భిణులు ప్రతి నెల 9, 10వ తేదీల్లో 4వ నెల నుంచి 9వ నెల వరకు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం ఆశా కార్యకర్తలు గాయిత్రి, లక్ష్మి నరసమ్మ, చంద్రకళ, నాగేంద్రమ్మ, సుబ్బలక్ష్మి, వీరమ్మ, అరుణ, రామాంజినమ్మ, సువర్ణమ్మ, వరలక్ష్మి, శివలక్ష్మి, ఇందిరమ్మ తదితరులు చందాలు వేసుకుని వైద్య పరీక్షలకు వచ్చిన 50 మంది గర్భిణులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శివప్రసాద్, సూపర్‌వైజర్స్ నరసింహ, అరుణ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్‌బాబు, ఫార్మసీ ఆఫీసర్ మూర్తి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యాధికారి శివకృష్ణ

హ్యాకథాన్‌లో ఎస్ఆర్ఐటీ విద్యార్థుల ప్రతిభ

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఏఐ అండ్ ఎంఎల్) విభాగానికి చెందిన తృతీయ సంవత్సరానికి చెందిన విద్యార్థులు హ్యాకథాన్‌లో ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ శుక్రవారం తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లోని గోకరాజు లైలావతి ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విభాగం వారు హ్యాక్‌గ్నీస్–2కే25 హ్యాకథాన్ నిర్వహించారన్నారు. వీటిలో ఓపెన్ ఇన్నోవేషన్ విభాగంలో మెంటల్ హెల్త్ ఎనాలసిస్ ఆఫ్ స్టూడెంట్స్ అనే వెబ్ యాప్స్‌ను అభివృద్ధి చేసి కళాశాలకు చెందిన మహమ్మద్ సబీల్, మహమ్మద్ ఇక్రామ్, మౌర్య, అయ్యప్ప, మహమ్మద్ ఫరాజ్ ప్రతిభ కనబరిచారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు టీపీఓ డాక్టర్ రంజిత్‌రెడ్డి, డాక్టర్ చిత్ర లింగప్ప, ఐఐఐ సెల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ హేమంత్‌కుమార్ యాదవ్, అధ్యాపకులు అభినందించారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

మారని వైద్యుల తీరు..

- ఓపీలకు డుమ్మా కొడుతున్న వైనం

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో వైద్యుల పనితీరులో ఎటువంటి మార్పు కన్పించడం లేదు. సందు దొరికితే చాలు విధులకు డుమ్మా కొడుతున్నారు. ఆస్పత్రిలోని చిన్నపిల్లల వార్డు, ఆర్థో, సర్జరీ, పల్మనాలజీ, మెడిసిన్, ఈఎన్‌టీ, తదితర వార్డుల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు ప్రభుత్వ సర్వజనాస్పత్రే పెద్ద దిక్కు. సుదూర గ్రామాల నుంచి వ్యయ ప్రయాసాలకు ఓర్చి అనంతపురం వస్తుంటారు. ఇక్కడ చూస్తే వైద్యులు అందుబాటులో ఉండి సేవలు అందించడం లేదు. అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్లు పీజీలకు వదిలేసి పత్తా లేకుండా పోతున్నారు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఎక్కడైనా సీనియర్ వైద్యుల పర్యవేక్షణలో పీజీలు పని చేస్తే రోగులకు నాణ్యమైన వైద్యం అందేందుకు వీలుగా ఉంటుంది. శుక్రవారం చిన్నపిల్లల ఓపీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ విధులకు డుమ్మా కొట్టారు. దీంతో పీజీలు వైద్య సేవలందించాల్సి వచ్చింది. ఇప్పటికైనా ఆస్పత్రి అధికారులు ఓపీలో రోగులకందుతున్న సేవలపై నిఘా ఉంచితే నాణ్యమైన వైద్యం అందే అవకాశం ఉంటుంది.

– అనంతపురం మెడికల్:



ఓపీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ లేకపోవడంతో రోగులను పరీక్షిస్తున్న పీజీలు

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

అనంతపురము డివిజన్

9912220732, 9912220719, 9912220724

9010223702, 7093156622, 9010567770, 7093157766